## విద్యార్థినులకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లతో విద్యార్థినులు, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చంద్రముఖర్జీ

అబిడ్స్: రిలయన్స్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వారం రోజులుగా వివిధ కోర్సుల్లో ఇస్తున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చంద్రముఖర్జీ బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కమ్యూనికేషన్, అడాప్టబులిటి, క్రియేటివిటీ, వర్క్‌ప్లాన్, బిహేవియర్‌తో పాటు ఇతర రంగాల్లో దాదాపు 50 మంది విద్యార్థినులకు శిక్షణ ఇప్పించామని ప్రిన్సిపాల్ తెలిపారు. లైవ్‌లీ ఉడ్ రీజనల్ డైరెక్టర్ ఆరతి సింగ్, గ్లోబల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి జయంత్ రస్తోజి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, అయోధ్య రాములు పాల్గొన్నారు.

## ఉనీద్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం




చెక్కు అందిస్తున్న డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్

గోల్కొండ: డయాలసిస్ పేషెంట్ల కిడ్నీ మార్పిడి కోసం ఉనీద్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని సాప్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. సాలార్‌జంగ్ కాలనీలోని సాప్ మెడికల్ సెంటర్‌లో ఓ మహిళకు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. అయితే ఆపరేషన్ డబ్బులకు సంబంధించి డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉచితంగా కిడ్నీ ఇచ్చేవారిని గుర్తించి ట్రస్ట్ వారు డయాలసిస్‌పై ఉన్నవారిని తమవద్దకు పంపిస్తే కిడ్నీ మార్పిడి చేస్తున్నామన్నారు. ట్రస్ట్ ప్రతినిధి వసీం అల్ కసేరి మాట్లాడుతూ.. ప్రతి నెల ఒక కిడ్నీని సేకరించి డయాలసిస్ రోగులకు అమర్చుతున్నామన్నారు.

# మార్కెట్లలో హోలీ సందడి!

● బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో రద్దీగా షాపులు ● అందుబాటులో మిఠాయి, కొబ్బరి,మిఠాయి దండలు, రంగులు

మార్కెట్లలో హోలీ సందడి నెలకొన్నది. బేగంబజార్ ఛత్రి, బర్తన్‌బజార్, ఫీల్‌ఖానా, సిద్ధిఅంబర్‌బజార్, చుడీబజార్ తదితర మార్కెట్లలో హోలీ సామగ్రి తక్కువ ధరలకే అందుబాటులో ఉండడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు ఇక్కడికి తరలివస్తున్నారు. విక్రయాదారులు కూడా తీరొక్క వస్తువులను పెడుతూ ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా బేగంబజార్ మార్కెట్‌లో కుర్తాలు, వివిధ రకాల రంగులు, పిచికారీలు, స్వీట్స్, మిఠాయి, కొబ్బరి దండల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. – జియాగూడ



పురానాపూల్‌లో కొనుగోలు చేస్తున్న దృశ్యం



ఛత్రి చౌరస్తాలోహోలీ సామగ్రి



సిద్ధిఅంబర్‌బజార్‌లో మిఠాయి దండలు

## అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు



మహిళా ఎస్సైలకు మెమొంటోలు అందిస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్, మహ్మద్ నజీబ్

గోల్కొండ: మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్లకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌తో కలిసి వారికి మెమొంటోలు అందజేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. మహిళలు విద్యనభ్యసిస్తేనే సమాజంలో గుర్తింపు పొందడమే కాకుండా ఆర్థికంగా బలోపేతం కావచ్చన్నారు. కార్యక్రమంలో టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు తదితరులు ఉన్నారు.

## ఓవైపు మురుగు..మరోవైపు ప్రమాదకర మ్యాన్‌హోల్..!



మేకల మండి వద్ద మురుగు నీరు, చెత్తాచెదారం



రోడ్డుపై మూతలేని మ్యాన్‌హోల్

జియాగూడ: జియాగూడ మేకల మండి నుంచి కేసరి హనుమాన్ 2జే బస్టాండ్ వరకు ఉన్న రోడ్డుపై ప్రమాదం పొంచి ఉంది. ఓవైపు మేకల మండి గేట్ నుంచి రోడ్డుపై గుంతల్లో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తుంటే మరోవైపు పలుచోట్ల మ్యాన్‌హోళ్లకు మూతలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు సమస్యను పరిష్కరించాలని లేకుంటే ధర్నా చేపడుతామని బస్తీవాసులు హెచ్చరించారు.

## ‘చారిత్రక చిత్ర వైభవం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ నటి ప్రభా తదితరులు

గన్‌ఫౌండ్రీ: యువకళావాహిని ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత వైట్ల కిశోర్ కుమార్ రచించిన ‘చారిత్రక చిత్ర వైభవం’ పుస్తకావిష్కరణ సభను బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటి ప్రభా హాజరై మాట్లాడుతూ.. నాటి చిత్ర విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఈ తరం పాఠకులకు అందించేలా ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు గాయనీ గాయకుల సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ నటుడు సుబ్బరాయ శర్మ, యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తవ్వి.. వదిలేశారు..!



గౌలిపురా: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు యూజీ కేబుల్ పనుల కోసం రోడ్లను తవ్వి వదిలేయడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాం, దీనికేతన్ గ్రౌండ్ నుంచి జ్ఞాన భారతి స్కూల్, కృష్ణవేణి స్కూల్, హనుమాన్‌నగర్ వరకు రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవం



వెటర్నరీ అసోసియేషన్ హాల్‌లో వేడుకల్లో పశు వైద్యాధికారులు సిబ్బంది

జియాగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అఖిల భారత సిటీ సెక్రటరీ పి.శశికళ ఆధ్వర్యంలో జియాగూడ ఇమాంపుర జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో మహిళా దివ్యాంగుల ఉమెన్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, ఇమాంపురా నవ భారత సంఘం అధ్యక్షులు మధిర సత్యనారాయణ, దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక కార్యదర్శి అడవయ్య, ఆర్.వెంకటేశ్, పునీత, భారతి, సునిత, శోభ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

**బిర్లా ఆడిటోరియంలో..**

అబిడ్స్: మహిళా సామాజికవేత్త ప్రియాంక జాదవ్ ఆధ్వర్యంలో బిర్లా ఆడిటోరియంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ హాజరై మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే విద్యార్థినులకు అన్నిరంగాలపై అవగాహన కలిగేలా విద్యాలయాలతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణను ఇవ్వాలన్నారు. భజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అనంతరం మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ జాదవ్, ఉమా బిరాదర్, సురేందర్ సురాన, ప్రబోద్ బిరాదర్ తదితరులు పాల్గొన్నారు.

**వెటర్నరీ అసోసియేషన్ హాల్‌లో ..**

విజయనగర్‌కాలనీ: తెలంగాణ పశువైద్యుల సంఘం, పశువైద్య అధికారుల సంఘం ఆధ్వర్యంలో విజయనగర్‌కాలనీ వెటర్నరీ అసోసియేషన్ హాల్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ గోపీ, అదనపు సంచాలకు డాక్టర్ మల్లీశ్వరీ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేశ్‌బాబుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇమాంపూరలో మహిళా దివ్యాంగులను సన్మానిస్తున్న జ్యోతి, సత్యనారాయణ



బిర్ల ఆడిటోరియంలో మహిళలను సత్కరించిన ఎమ్మెల్సీ దయానంద్, ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT: AT: LB, NAGAR
AS. No. 133 Of 2024

Between: -
K. Krishna, (Died per LRS) & others ... Appellants
AND
A. Rajesh and others ...Respondants

To,
A.N Abraham, S/o. A Nathanel,
Aged about 74 years, Occ: Business,
R/o. H. No. 9-4-847-141, 1st Floor,
Kakatiyanagar, Hyderabad. ....Respondent no.6

Sir,
Please take notice that the appellants filed above Appeal Suit against the the Decree and Judgment passed in O.S.No.2317/2011, dated 26-06-2024, on the file of Principal Senior Civil Judge-Cum-Assistant Sessions. Ranga Reddy District, at L.B. Nagar, The above appeal suit is posted to 19-03-2025 at 10.30 AM, for your notice. if you fails to appear on the said date and time, the matter will be decided in your absence.

(BY ORDER OF COURT)
Kasoju Yadagiri, B.A, LLB, PGDPR, Advocate
Sri Sai Nilayam, 9-1-33/29/A, Langerhouse, Hyderabad-8. Cell: 9848827443, 9440384443

## సాయిబాబాచారి సేవలు వెలకట్టలేనివి



సాయిబాబాచారికి మెమొంటో అందిస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: గోల్కొండ జగదాంభిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి సేవలు వెలకట్టలేనివని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. 40 ఏళ్లకు పైగా సాయిబాబాచారి నిరుపేదలకు చేయూతనందిస్తుండడంతో గోల్కొండ ఉర్దు హైస్కూల్ వారు సయ్యద్ ఫయాజ్ చేతుల మీదుగా బుధవారం గోల్కొండలో ఆయనకు మెమొంటో అందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బి.శ్రీకాంత్‌చారి, శ్రీ మహంకాళి ఆలయ పూజారి సురేశ్‌చారి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపిస్తే ఆ కుటుంబాలు రోగాల బారిన పడవన్నారు. మున్ముందు కూడా తమ కళాశాలలో బోధన, బోధనేతర, సిబ్బంది, విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రుబీనా

## చెట్ల కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మలు తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

నాంపల్లి: హైమాస్ట్ లైట్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను బుధవారం జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. కాంగ్రెస్ నేతలు జి.వెంకటేశ్, కె.రవితేజ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ ఫిర్యాదు మేరకు మల్లెపల్లి, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లకు అడ్డంగా ఉన్న చెట్లు, వాటి కొమ్మలను తొలగించారు.




# కేన్సర్‌ను ముందే గుర్తిస్తే నిర్మూలించవచ్చు



బ్రెస్ట్ కేన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్: కేన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం పొందితే పూర్తిగా నిర్మూలించవచ్చని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలోని బ్లూబర్డ్స్ హై స్కూల్‌లో ఎంజేఆర్ కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రెస్ట్ సర్వైకల్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ... మహిళలు కుటుంబ బాధ్యతతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. బ్రెస్ట్ కేన్సర్‌ను నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు కేన్సర్ వ్యాధిపట్ల ఆందోళన చెందకుండా సంబంధిత డాక్టర్లను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మనోజ్‌కుమార్, డాక్టర్ యోక్షిత, ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పూసగోరఖ్‌నాథ్, దీన్‌దయాల్‌రెడ్డి, సత్యనారాయణబాబు, రాజేందర్, శ్రీకాంత్‌యాదవ్, టీఆర్ గోవింద్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, ఎంజేఆర్ కేన్సర్ స్క్రీనింగ్ రీజినల్ సెంటర్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్మిత్ జాగీ, సవితాప్రేమ్, ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేసులు ఉపసంహరించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ దివ్యాంగ విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ డిమాండ్ చేశారు. గత వారం ఓయూ వీసీ చాంబర్‌లో మెస్ బిల్లులు రద్దు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేసి అఫ్జల్‌గంజ్ పీఎస్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలా అయితే వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. కేసులను వెనక్కు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేపట్టనున్నట్లు శ్రీశైలం యాదవ్ హెచ్చరించారు.

## ఎమ్మెల్సీ పదవిపై హర్షం

గన్‌ఫౌండ్రీ: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతి బిడ్డ దాసోజి శ్రవణ్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ హర్షం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా బీజేపీనే నమ్ముకున్న టి.ఆచార్యకు కూడా రాష్ట్ర అధ్యక్ష పదవి లేదా రాజ్యసభకు ఎంపిక చేసి బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. అదేవిధంగా ఓయూ జేఏసీ నేత దరువు అంజన్నకు కాంగ్రెస్ సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి రాష్ట్ర, జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌వీ నాయకుల అరెస్టు

అబిడ్స్: విద్యాశాఖకు మంత్రిని నియమించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని బుధవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించిన ఎంజేమార్కెట్, నాంపల్లి ప్రాంతాల బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి షాహినాయత్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, రాజీవ్ సాగర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్ యాదవ్ అరెస్టు అయినా వారిని పరామర్శించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# దేశ జనగణనలో కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న కోల జనార్దన్, గుజ్జ కృష్ణ

ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ నేషనల్ కన్వీనర్ కోల జనార్దన్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులాల వారీగా ఓబీసీల లెక్కలు సేకరించాలని ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ నేషనల్ కన్వీనర్ కోల జనార్దన్ డిమాండ్ చేశారు. ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ‘సామాజిక న్యాయం - రాజ్యాధికారంలో ఓబీసీల పాత్ర’అనే అంశంపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జనాభాలో బీసీల దామాషా ప్రకారం కులాలవారీగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయించలేదని ఆరోపించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు పగడాల సుధాకర్, తంగెళ్లముడి నందగోపాల్, ఉదయ్‌కుమార్ నేత, మట్ట జయంతి, నీలం వెంకటేష్, రాజు నేత తదితరులు పాల్గొన్నారు.

## లోపభూయిష్టంగా కేంద్ర బడ్జెట్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లోపభూయిష్టంగా ఉందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ అన్నారు. అది కేవలం పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పట్టణం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ‘కేంద్ర బడ్జెట్–2025 ప్రజా ప్రత్యామ్నాయం’అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలు, రైతులు, యువత మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నప్పటికీ కేటాయింపులు మాత్రం అలా లేవన్నారు. కీలకమైన విద్యా, వైద్య రంగాలకు.. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీ కోతలు పెట్టారని విమర్శించారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కె. శివకుమార్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఈవీఎస్ఎస్ రవీంద్రనాథ్, నాయకులు పాల్గొన్నారు.

## డబ్బులు కాజేసిన నిందితుడి అరెస్టు

చార్మినార్: డబ్బులు కాజేసిన నిందితుడిని అరెస్టు చేసి కంట్రీమేడ్ పిస్టల్, 5 రౌండ్ల బుల్లెట్లతో పాటు 2 ఐఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రా తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రామ్ స్వరూప్ (22) ఉద్యోగరీత్యా నగరంలోని మంగళహాట్ లో నివసిస్తున్నాడు. పాతబస్తీ రికాబ్‌గంజ్ లోని రాజలక్ష్మీ టెక్స్ టైల్స్ లో క్యాషియర్ కం బిల్లింగ్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. యజమానికి నమ్మకంగా పనిచేస్తూ రూ. 70 లక్షలు గోల్‌మాల్ చేశాడు. ఈ విషయమై టెక్స్ టైల్స్ డైరెక్టర్ జయరామ్ దేవసి చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. డబ్బులో నుంచి రూ. 40 వేలతో రాజస్థాన్ కు చెందిన మోహన్ రావు నుంచి కంట్రీమేడ్ స్టార్ మార్క్ పిస్టల్ ఖరీదు చేశాడు. అలాగే మరో రెండు ఐఫోన్లను కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడు మోహన్ రావు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో చార్మినార్ ఏసిపి చంద్రశేఖర్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిసిపి స్నేహామెహ్రా

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273